ప్రజాశక్తి

ఆదివారం 12 మార్చి 2023 5

పార్వతీపురం మన్యం

వెంకటబైరిపురంలో గడ్డివాములు దగ్ధం

అగ్నిప్రమాదంలో కాలిపోతున్న గడ్డివాములు

మక్కువ : మండలంలోని వెంకట బైరిపురంలో శనివారం సుమారు పది గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామంలోని వాటర్ ట్యాంక్ సమీపాన రైతులు పశువుల మేత కోసం గడ్డిని నిల్వ వేసుకున్నారు. ఈ ప్రమాదం లో శీర కాశినాయుడుకు చెందిన ఐదు, శీర.పైడిపునాయుడువి రెండు, బిక్కిని వెంకన్నబాబువి ఒకటి, యండమూరి త్రినాధకు చెందిన రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తుల పనైనా లేక విద్యుత్ వైర్లు పై ఉండడంతో ఏమైనా ప్రమాదం సంభవించిందా అన్న అనుమానాలు వ్యక్తవుతున్నాయి.

ముగిసిన ప్రచారం

ముందంజలో డాక్టర్ కోరెడ్ల రమాప్రభ

సోషల్ మీడియా వేదికగా విస్తృత ప్రచారం

కుల, ధన, గిఫ్ట్ ప్యాక్‌లతో వైసిపి, ఇతర పక్షాలు

ప్రచారం చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ

ఈ నెల 13న జరుగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం శాసన మండలి ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రంతో ముగిసింది. పోలింగ్‌కు ఇంకా 24గంటల సమయం మాత్రమే ఉంది. సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4గంటలు వరకు పోలింగ్ జరుగనుంది. పోటీలో 250 ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభతో సహా పలు రాజకీయ పార్టీలకు చెందిన వారు, స్వతంత్ర అభ్యర్థులు మొత్తం 37 మంది బరిలో ఉన్నారు. ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నంలో మొత్తం 2,89,214 మంది ఓటర్లు ఉండగా, ఒక్క విజయనగరం జిల్లాలో 58, 502 మంది, పార్వతీపురం మన్యం జిల్లాలో 18520 మంది ఓటర్లు ఉన్నారు.

ప్రజాశక్తి - విజయనగరం

గత నెల 16న నామినేషన్లతో ప్రారంభమైన ప్రచారం ఉత్తరాంధ్రలోని ఐదు జిల్లాల్లోనూ ముమ్మరంగా సాగింది. అభ్యర్థులంతా ఈసారి సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రోగ్రెసివ్ డెమక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) ప్రచారం ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రభంజనంలా సాగింది. ప్రజా సంఘాల శ్రేణులు విస్తారంగా పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ పేరును పట్టభద్రుల్లో ప్రచారం చేయడంతో ఆమె ముందంజలో ఉన్నారు. మరోవైపు సోషల్ మీడియాలోనూ ప్రచారం హోరెత్తింది. అనేక సంవత్సరాలుగా ఉత్తరాంధ్ర జిల్లాలను పీడిస్తున్న ప్రధాన ప్రజా సమస్యలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, మహిళా రంగాలకు చెందిన అంశాలే అజెండాగా పిడిఎఫ్ చేపట్టిన ప్రచారం సర్వత్రా ఆమోదయోగ్యంగా నిలిచింది.

ఎమ్మెల్సీ బరిలో ప్రధాన రాజకీయ పార్టీలు

ప్రధాన రాజకీయ పార్టీలైన వైసిపి, తెలుగుదేశం, బిజెపికి చెందిన అభ్యర్థులు బరిలో ఉండడం ఈ దఫా ఒక ప్రత్యేకతగా ఉంది. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ బిజెపి అభ్యర్థి పివిఎన్ మాధవ్‌కు మద్దతు ఇవ్వడంతో ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీగా ఆయన గెలిచారు. ఈసారి ఈ రెండు పార్టీలు వేర్వేరుగా బరిలోకి దిగాయి. దీంతో రూ.కోట్లు ఖర్చుపెట్టి నెగ్గే పనిలో బిజెపి నిమగ్నమైంది. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి వేపాడ చిరంజీవిరావు కూడా రూ.కోట్లు ఖర్చు చేసేందుకు వెనుకాడలేదు. గత ఎన్నికల్లో వైసిపి నుంచి అభ్యర్థి బరిలో లేడు. ఈ సారి రియల్ ఎస్టేట్ వ్యాపారి సీతంరాజు సుధాకర్ ను ఆ పార్టీ పోటీకి దింపింది. రూ.కోట్ల ఖర్చుతో గట్టెక్కాలని ఇప్పటికే ఆయన డబ్బులు, గిఫ్ట్‌లు పంపకాలకు పాల్పడ్డారు.

ప్రలోభాలను తిప్పికొట్టనున్న పట్టభద్రులు

ప్రభుత్వ విధానాలతో విసిగి వేసారిపోయిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగ పట్టభద్రులు వైసిపి, బిజెపి, టిడిపి అభ్యర్థుల ప్రలోభాలను తిప్పికొట్టేందుకు సన్నద్ధంగా ఉన్నారు. వైసిపి అభ్యర్థి డబ్బు పంపిణీ, బహుమతులు, వెండి నాణేలు, చీరలు ఇతర సామగ్రి పంపిణీని పెద్ద ఎత్తున పట్టభద్రులకు ఇవ్వజూపారు. టిడిపి కూడా అదే తోవలోనే నడుస్తోంది. బిజెపి నుంచి సిట్టింగ్ అభ్యర్థే రంగంలో ఉండడంతో పెద్ద ఎత్తున ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తున్నారు.

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి ప్రత్యేక సెలవు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే ప్రభుత్వ ఉద్యోగులతోపాటు పోలింగ్ రోజున కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కూడా ప్రత్యేక సెలవు వర్తింపజేస్తూ ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ సూర్యకుమారి తెలిపారు. ఎపి ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీతోపాటు కేంద్ర ప్రభుత్వ పథకాల అమల్లో పని చేస్తున్న కాంట్రాక్టు సిబ్బందికి కూడా ఈ సెలవు వర్తిస్తుందని పేర్కొన్నారు.

అనర్హులకు ఓటు హక్కు

శృంగవరపుకోట : ఎమ్మెల్సీ ఎన్నికల్లో అక్రమంగా గెలిచేందుకు వైసిపి ప్రభుత్వం అనర్హులకు ఓటు హక్కు కల్పించిందని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ఆరోపించారు. శనివారం పట్టణంలో స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బోగస్ ఓట్లను ప్రభుత్వం తొలగించలేదన్నారు. ఈవిషయాన్ని ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. అనర్హులకు ఓటు హక్కును కల్పించిన వైసిపి నాయకులపై న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. సమావేశంలో మండల క్లస్టర్ ఇన్‌ఛార్జులు ఇందుకూరి శ్రీనురాజు, కాపుగంటి శ్రీనివాస్, రెడ్డి వెంకన్న, ఐటిడిపి రాష్ట్ర కార్యదర్శి చెక్కా కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రభంజనంలా పిడిఎఫ్ ప్రచారం

పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ ఉమ్మడి జిల్లాల్లోని 118 మండలాలల్లో తమ పర్యటనను పూర్తి చేసుకుని, 40వేల మందికి పైగా పట్టభద్రులైన ఓటర్లను ప్రత్యక్షంగా కలిసి ఓటును కోరడం ఈ ఎన్నికల్లో ఓ ప్రత్యేకత. ఉమ్మడి జిల్లాల్లోని మారుమూల ప్రాంతాల్లోకి సైతం ఆమె గళం వెళ్లింది. చాలా హుందాగా ప్రచారం నిర్వహించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు, నిరుద్యోగులు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, మహిళలు, విద్యార్థులు ఇలా అన్ని వర్గాల ప్రజల సమస్యలపై అవగాహన ఉన్న వ్యక్తిగా వారందరి మన్ననలూ పొందారు. దీంతో సర్వత్రా పిడిఎఫ్ అభ్యర్థికి పట్టభద్రుల ఓటర్లు బ్రహ్మరథం పట్టారు.

250 ప్రజా సంఘాలు బలపరచిన వ్యక్తిగా ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నంలో ఆమె పేరు మార్మోగుతోంది. ఉతరాంధ్ర ప్రాంత అభివద్ధి, రాష్ట్ర ప్రయోజనాలు కాపాడబడాలంటే పిడిఎఫ్ ఎమ్మెల్సీ గెలవాలని విద్యావంతులు కోరుకుంటున్నారు. బరిలో నిలిచిన అంత మంది అభ్యర్థుల దాటుకుంటూ ఓ మహిళా అభ్యర్థి ముందంజలో ఉండడంతో అధికార పార్టీ వెన్నులో వణుకు ప్రారంభమైంది. ఎంత ఎక్కువగా ప్రలోభాలకు పట్టభద్రులను గురిచెయ్యాలనే తపనతో వైసిపి శ్రేణులను, బయట నుంచి కిరాయికి తెచ్చుకున్న యువతను వినియోగిస్తూ అక్రమాలకు పాల్పడేందుకు సన్నద్ధమయ్యారు. వీటన్నింటినీ, చైతన్యంతో ఉత్తరాంధ్ర పట్టభద్రులు తిప్పికొట్టి పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు తమ మొదటి ప్రాధాన్యత ఓటును వేసి, అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారు.

ప్రలోభాల పనిలో అధికార, ప్రతిపక్షా లు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్రకార్యదర్శివర్గసభ్యులు వై.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - కలెక్టరేట్

రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు కోసం అధికార ప్రతిపక్షాలు ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే పనిలో ఉన్నాయని సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఓటర్లకు పెడుతున్న ప్రలోభాలపైనా, ఎన్నికల కమిషన్ తీరుపైనా శనివారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రస్తుతం 5 ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఓటరు నమోదు ప్రక్రియ నుంచి జరగబోయే ఎన్నికల వరకు అన్ని దశల్లోనూ అధికార పార్టీ అక్రమ మార్గాల ద్వారానే గెలుపు సాధించేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నదని అన్నారు. ఇప్పటికే విడుదల చేసిన ఓటరు జాబితాలో అర్హత లేని వారిని ఓటర్లుగా నమోదు చేయించారని, పట్టభద్రుల ఓటర్ల లిస్టులో కేవలం పదవ తరగతి, ఐదో తరగతి చదివిన వ్యక్తుల పేర్లు ఉండటంతో ఓటరు నమోదు ప్రక్రియ ఏ విధంగా జరిగిందో అర్థం చేసుకోవచ్చునని అన్నారు. రాష్ట్రంలో నేటి వరకు 8వేలకు పైగా తప్పుడు ఓటరు నమోదులను గుర్తించినట్లు తెలిపారు. దీనిపై ఎన్నికల కమిషన్ అధికారులకు తెలియజేసినప్పటికీ తూతు మంత్రంగానే స్పందిస్తున్నారు తప్ప, జరిగిన తప్పిదాలపై చర్యలు తీసుకోవడం లేదన్నారు.

సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లోకనాథం మాట్లాడుతూ ప్రభుత్వం పథకం ప్రకారం అధికారులం దర్నీ ప్రభుత్వానికి అనుగుణంగా ఎన్నికల్లో ఉపయోగించుకుంటూ ముందుకు సాగుతుందని అన్నారు. ఇప్పటికే ఓటర్లను ప్రభుత్వం అన్ని రకాల ప్రలోభాలకు గురి చేస్తూ ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తుందని అన్నారు. పార్వతీపురం నియోజవర్గం ఎమ్మెల్యే అలజంగి జోగారావు ప్రత్యక్షంగా ఓటర్లను, అధికారులను అధికార పార్టీకి అనుకూలంగా ఉపయోగించుకుంటూ, పిడిఎఫ్ అభ్యర్థిని ఓడించేందుకు కుయుక్తులు పన్నుతున్నారని అన్నారు. ఓటర్లంతా విచక్షణతో ఆలోచించి అధికార ప్రతిపక్ష పార్టీలు చూపే ప్రలోభాలకు మోసపోకుండా శాసనమండలిలో ప్రజా సమస్యలపై పోరాడే పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. సిపిఎం మన్యం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాలో అధికార పార్టీ నాయకులు మహిళా దినోత్సవం పేరిట వాలంటీర్లను ఉపయోగించుకొని మహిళ ఓటర్లకు చీరలు పంపిణీ చేశారని తెలిపారు. ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించి వారి దగ్గర ఓట్లు అడిగే ధైర్యం లేక అధికారబలాన్ని ఉపయోగించి ఓటర్లను ఇబ్బంది పెడుతోందని అన్నారు. సమావేశంలో సిపిఎం పట్టణ నాయకులు గొర్లి వెంకటరమణ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఈనెల 15 నుంచి ఏప్రిల్ 4 వరకూ జరగనున్న ఇంటర్మీడియెట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. ఇంటర్మీడియెట్ పరీక్షల ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి శనివారం జిల్లా కలెక్టర్లు, పోలీసు, ఇంటర్మీడియెట్ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. తొలుత రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ పరీక్షల నిర్వహణకు సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలన్నారు. పరీక్షల సమయంలో విద్యుత్ అంతరాయం కలుగకూడదని, పరీక్షాకేంద్రాల్లో మంచినీరు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. విద్యార్థులకు రవాణా సదుపాయాలు కల్పించాలని, ఉదయం 8 గంటలకల్లా పరీక్షా కేంద్రానికి చేరేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. 9గంటల తరువాత పరీక్షా కేంద్రంలోనికి విద్యార్థులను అనుమతించడం జరగదన్నారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేయవలసినదిగా పోలీసు శాఖను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టరు అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో ఫ్లయింగ్ స్క్వాడ్‌ల సంఖ్యను పెంచాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిధిలో 144 సెక్షను అమలు చేయాలని, పరీక్షా పేపర్లు తీసుకొచ్చినప్పుడు, సమాధాన పత్రాలు తీసుకెళ్లేటప్పుడు అవసరమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల్లోనికి విద్యార్థులు, సిబ్బంది మొబైల్ ఫోన్లు, ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకువచ్చుటకు అనుమతించకూడదని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో గల జెరాక్స్ సెంటర్లను మూసివేయాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద వైద్య సిబ్బంది ఒఆర్ఎస్. పేకెట్లు, మందులతో క్యాంపు ఏర్పాటు చేయాలని, పరీక్షల సమయంలో విద్యుత్ అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరేలా ఎ.పి.ఎస్.ఆర్.టి.సి. అధికారులు బస్సులను నడపాలని తెలిపారు. సమావేశంలో జిల్లా ఎస్పి వి. విద్యాసాగర్‌నాయుడు, డిఎస్‌పి ఎ.సుబాష్, జిల్లా ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ అధికారి డి.మంజులవీణ పాల్గొన్నారు.

రూ.739 కోట్లతో రామతీర్థసాగర్ పనులు

- 1400 కుటుంబాలకు రూ.75కోట్ల పరిహారం
- మూడు గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు అనుమతి
- ఇరిగేషన్‌శాఖ నార్త్‌కోస్ట్ చీఫ్ ఇంజినీర్ సుగుణాకరరావు

మాట్లాడుతున్న సుగుణాకరరావు

ప్రజాశక్తి-బొబ్బిలి

రామతీర్థసాగర్ ప్రాజెక్టు పనులు ఐదు ప్యాకేజీలతో రూ.739 కోట్లతో జరుగుతు న్నాయని ఇరిగేషన్ శాఖ నార్త్‌కోస్టు చీఫ్ ఇంజినీర్ ఎస్.సుగుణాకర రావు తెలిపారు. స్థానిక ఇరిగేషన్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. నిర్వాసితులైన ఒక్కో కుటుంబానికి రూ.5.5లక్షలు చొప్పున 1400కుటుంబాలకు రూ.75కోట్లు మంజూరైందని తెలిపారు. ఆర్‌అండ్‌ఆర్ కోసం రూ.174కోట్లు అవసరమని, తొలి విడతగా రూ.34కోట్లు మంజూరయ్యా యన్నారు. ఖరీఫ్‌లో తోటపల్లి ద్వారా 13వేల ఎకరాలకు సాగునీరందిం చామని, మిగతా 8వేల ఎకరాల ఆయకట్టు భూములకు ఈ సీజన్‌లో నీరందిస్తామని తెలిపారు. కుడి, ఎడమ కాలువలకు సుమారు 55 కిలోమీటర్ల పొడవునా లైనింగ్ పనులు ప్రారంభించామన్నారు. వందేళ్ల క్రితం నాటి హెడ్ వర్క్స్ రక్షణ కోసం రూ.173కోట్ల సాయంతో ప్లాన్ గ్రాంటు కింద నిధులు మంజూరవుతాయని తెలిపారు. బొబ్బిలి నియోజకవర్గ పరిధిలో రూ.43 కోట్లతో రాముడువలస, లోచర్ల ఎత్తిపోతల పథకాల పనులు చేపట్టామన్నారు. రూ.53కోట్లతో వెంగళరాయసాగర్, రూ.14కోట్లతో పెదంకలాం, రూ.38కోట్లతో వట్టిగెడ్డ, రూ.24కోట్లతో పెద్దగెడ్డ రూ.18కోట్లతో ఆంధ్ర ప్రాజెక్టుల కాలువ లైనింగ్ పనులు జరుగున్నాయని తెలిపారు. జంఝావతి ప్రాజెక్టు కోసం ఒడిశాలో ఐదు గ్రామాల నుంచి 1300 ఎకరాల భూసేకరణ జరగాల్సి ఉందన్నారు. గ్రామీణ ఉపాధి హమీ కింద చెరువుల్లో మట్టి తవ్వకాల పనులకు ఇక అనుమతి లేదని ఆయన తెలిపారు. రూ.140కోట్లతో ఇరిగేషన్ కాలువల నిర్మాణాలు, ఇతర మెటీరియల్ కాంపొనెంట్, చెరువుల అనుసంధాన పనులు మాత్రమే జరుగుతాయని తెలిపారు.

పోలింగు కేంద్రాల పాఠశాలలకు ప్రత్యేక సెలవు

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఈనెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా పోలింగు కేంద్రాలు ఏర్పాటు చేసిన పాఠశాలలకు మార్చి 12, 13 తేదీల్లో ప్రత్యేక సెలవు ప్రకటించినట్లు కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. పోలింగ్ రోజు స్థానిక సెలవు ప్రకటించబడిందని, స్థానిక సెలవు దినాల్లో జిల్లాలోని ట్రెజరీలు, సబ్ ట్రెజరీలు, అన్ని ఇతర కార్యాలయాలు /సంస్థలు యధావిధిగా పనిచేస్తాయని పేర్కొన్నారు. 1.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలికలు) వీరఘట్టం, 2. ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల (బాలుర) సీతంపేట, 3. జిల్లా పరిషత్ హైస్కూలు (భామిని), 4.ప్రభుత్వ ఉన్నత పాఠశాల (పాలకొండ), 5.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కొమరాడ, 6. ఎపిటిడబ్ల్యుఆర్ స్కూల్ (బాలుర) భద్రగిరి, గుమ్మలక్ష్మీపురం, 7.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కురుపాం, 8. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జియ్యమ్మవలస, 9. జిల్లా పరిషత్ హైస్కూలు, గరుగుబిల్లి, 10. డివిఎం హైస్కూల్ (బెలగాం), 11. ప్రభుత్వ జూనియర్ కాలేజ్ (పార్వతీపురం), 12. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (మక్కువ), 13.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (సీతానగరం), 14. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బలిజిపేట), 15. ప్రభుత్వ ఉన్నత పాఠశాల (సాలూరు), 16. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (పాచిపెంట)కు పోలింగు ఆది, సోమవారాలు సెలవు ప్రకటించినట్లు తెలిపారు.

కోడ్ ఉల్లంఘనపై చర్యలు తీసుకోండి : టిడిపి

పార్వతీపురం రూరల్ : నియోజకవర్గంలోని 9 ఎన్నికల కేంద్రాల పరిధిలో గల ఓటర్ల జాబితాలో డూప్లికేట్ ఓటర్ల నమోదు అధిక సంఖ్యలో ఉందని, అధికార వైసిపి ఎన్నికల నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తుందని, వీటిపై వెంటనే చర్యలు చేపట్టాలని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి జగదీష్ డిమాండ్ చేశారు. నియోజక వర్గ టిడిపి ఇన్చార్జి బొబ్బిలి చిరంజీవులతో కలిసి డిఆర్ఒ జె.వెంకట్రావుకు శనివారం వినతి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడిపోతే ప్రజల్లో ఉన్న వ్యతిరేకత ప్రస్ఫుటమవుతుందనే భావనతో వైసిపి యథేచ్ఛగా ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తోందన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా వాలంటీర్లకు ఎమ్మెల్సీ ఓట్ల నమోదు అప్పగించడం తో వారు ఒత్తిడిని తట్టుకోలేక అనర్హులను సైతం ఓటర్లుగా నమోదు చేశారని అన్నారు. అంతేకాక డూప్లికేట్ ఓటర్లు అధిక సంఖ్యలో ఉన్నారని, తమ ప్రాథమిక పరిశీలనలోనే 190మంది ఓటర్లు రెండు సార్లు నమోదైనట్లు ఉందని, ఈ విషయం అధికారుల సైతం కనిపెట్టలేకపోవడం దురదృష్టకరమని అన్నారు. అఎమ్మెల్సీ కోడ్ అమల్లో ఉండగా నిబంధనలకు వ్యతిరేకంగా స్థానిక ఎమ్మెల్సీ పట్టణంలోని పలు వార్డుల్లో వాలంటీర్లతో కలిసి ఓటర్ల ఇళ్లకు వెళ్లి ప్రచారం నిర్వహించారని, అన్నారు. పట్టభద్రులు, మేధావుల కోసం ఏర్పాటు చేయబడ్డ శాసనమండలి స్థానాన్ని పెట్టుబడిదారులకు, రాజకీయ బ్రోకర్లకు కట్టబెట్టేందుకు అధికారపక్షం అడ్డదారులన్నీ తొక్కుతోందని అన్నారు. ఈ సంఘటనలపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జి.ఉదయభాను, జి.రవికుమార్, డి.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మండలిలో ప్రజావాణి వినిపిస్తా

- విద్య, వైద్యం అందించడంలో ప్రభుత్వ విఫలం
- పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, రణస్థలం

తనను గెలిపిస్తే శాసన మండలిలో ఉత్తరాంధ్ర ప్రజల వాణిని వినిపిస్తానని పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ అన్నారు. శనివారం శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(రిమ్స్), వైద్య కళాశాల, రణస్థలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు విద్య, వైద్యం అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. బాగా వెనుకబడ్డ ఉత్తరాంధ్ర జిల్లాల్లో సరైన వైద్య సదుపాయం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. శ్రీకాకుళం రిమ్స్ వైద్య కళాశాల ఏర్పాటై ఏళ్లు గడుస్తున్నా బాలారిష్టాలు వీడలేదన్నారు. భవనాలు నిర్మించినా మెడికల్ కళాశాల, ప్రజా వైద్యశాలలో పని చేసేందుకు సరిపడ వైద్యులు, ఇతర సిబ్బంది లేరన్నారు. కాంట్రాక్టు సిబ్బందిపై పని ఒత్తిడి పెరుగుతోందన్నారు. వీరిని రెగ్యులర్ చేయాల్సిన ప్రభుత్వం ఏళ్ల తరబడి వెట్టి చాకిరి చేయిస్తోందని విమర్శించారు. జిల్లా నుంచి స్పీకర్, ఇతర శాఖల మంత్రులు ఉన్నా జిల్లాలో అభివృద్ధి కాదు కదా, మరింత వెనుకబాటుకు నెట్టబడుతోందని అన్నారు. 194 కిలోమీటర్ల సుదూర తీర ప్రాంతం కాలుష్యం బారిన పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి ప్యాకేజీ, రైల్వేజోన్, మెట్రో రైల్ వంటి అంశాల్లో రాష్ట్రానికి కేంద్రం ద్రోహం చేసిందని అన్నారు. స్టీల్ ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టిందని చెప్పారు. దీన్ని ప్రశ్నించాల్సిన అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు ఆ పని చేయడం లేదని అన్నారు. ద్రోహం చేసిన కేంద్ర ప్రభుత్వంతో దోస్తీ చేస్తున్నాయని చెప్పారు. ప్రజా సమస్యలపై మండలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమే నిలదీస్తున్నారని అన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీల బలం మండలిలో ఎంత పెరిగితే పట్టభద్రులు, వివిధ తరగతుల వాణిని వినిపించే అవకాశం ఉంటుందని చెప్పారు. తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి, గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచారంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, ఐద్వా నాయకులు లక్ష్మి. పాణిగ్రాహి, ఆర్.సురేష్‌బాబు, తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో ప్రచారం చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభ

అందరి నోటా రమాప్రభ గెలుపుమాట

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఈనెల 13న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో ఏ నోట విన్నా పిడిఎఫ్ తరపున పోటీచేస్తున్న డాక్టర్ కోరెడ్ల రమాప్రభ గెలుపుమాటే వినిపిస్తోంది. ఆమె గెలుపు తథ్యమంటూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగులు, విద్యార్థులు సహా అందరి పబ్లిక్ టాక్. ఈ ఎన్నికల్లో రాజకీయ పార్టీల తరపున పోటీస్తున్న అభ్యర్థులను ఆదరించే పరిస్థితి లేదన్న వాదన కూడా వ్యక్తమౌతోంది. ఇందుకు కారణం లేకపోలేదు. విధానాల పరంగా వైసిపి, టిడిపిల మధ్య తేడా లేదు. పిపిఎస్ విధానం తీసుకొచ్చింది చంద్రబాబు ప్రభుత్వం. దాన్ని వారం రోజుల్లో రద్దుచేస్తామంటూ ఎన్నికల్లో హామీ ఇచ్చిన జగన్మోహన్‌రెడ్డి తీరా అధికారంలోకి వచ్చాక రద్దు కుదరదంటూ తమ మంత్రులు, సలహాదారులతో కుండబద్దలు కొట్టినట్లు చెప్పించారు. పైగా కొత్తగా జిపిఎస్ తీసుకొస్తామంటూ చెబుతున్నారు.

ఇప్పుడు టిడిపి తరపున ఎమ్మెల్సీ బరిలో నిలిచిన అభ్యర్థి సిపిఎస్ రద్దు మాట వైసిపి నిలబెట్టుకోలేదంటూ విమర్శిస్తున్నారు. సిపిఎస్ విధానం అమలే టిడిపి హయాంలో జరిగింది కదా? అని ప్రశ్నిస్తే ఆ అభ్యర్థి నాలుక కరుచుకున్న దుస్థితి చోటుకుసుకుంది. ఇక ఉత్తరాంధ్ర అభివృద్ధికి తలమానికంగా వున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విదేశీ బహుళజాతి సంస్థకు అమ్మజూపుతుంటే ఇటు వైసిపిగానీ, అటు టిడిపిగానీ కేంద్రం వద్ద నోరు మెదపడం లేదు. ప్లాంటు ఎదుట సిఐటియు సహా పలు కార్మిక సంఘాల మద్దతుతో ఏర్పాటు చేసిన దీక్షా శిబిరం వద్దకు ఈ రెండు పార్టీలకు చెందిన నాయకులు వచ్చిమొసలి కన్నీరు కార్చారు. ఇక 2014 ఎన్నికల్లో బాబు వస్తేనే జాబు అన్న టిడిపి జిల్లాలో వున్న కొద్దిపాటి జ్యూట్ మిల్లుల మాసివేతకు కారణమైంది. ఆ తరువాత 2019లో ఏటా జనవరి 1న జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తానన్న సిఎం జగన్మోహన్‌రెడ్డి ఉన్నవాటిని మూసివేశారు. దీంతో, జిల్లాలో కొత్తగా జాబులు రాలేదు సరికాదా, ఉన్న ఉద్యోగులు, ఉపాధి మార్గాలు కూడా లేకుండా పోయాయి. దీంతో, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం చదువుకున్న యువత సైతం ఉద్యోగాల కోసం ఎప్పటి మాదిరిగానే సుదూర ప్రాంతాలకు వలస కూలీల మాదిరిగా పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వ్యవసాయం, సాగునీటి వనరుల అవృద్ధిపైనా ఈ రెండు ప్రభుత్వాల వైఖరీ ఒక్కటే.

జిల్లాలో ఎన్నో జీవనదులు ఉన్నా వాటిపై రిజర్వాయర్లు నిర్మించలేదు. తోటపల్లి, జంఝావతి, తారకరామ తీర్థసాగర్, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి వంటిని ఆశగా చూపి ఏటా సాధారణ ఎన్నికల్లో ఓట్లు దండుకోవడం మినహా వాటిని పూర్తిచేయాలన్న చిత్తశుద్ధి పాలకపార్టీల్లో మచ్చుకుకూడా కనిపించడం లేదు. మరో మాటలో చెప్పాలంటే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి సరెండర్ అయిపోయాయి. రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీలు నెరవేర్చక పోయినప్పటికీ ఇటీవల జరిగిన రాష్ట్రపతి ఎన్నికల్లో టిడిపి, వైసిపిలు పోటీపడి మరీ బిజెపి తరపున పోటీచేసిన ద్రౌపతిముర్ముకు ఓట్లేసి గెలిపించాయి. ఈనేపథ్యంలో రెండు పార్టీల జెండాలు మారినా అజెండా ఒక్కటేనన్న విషయం తమకు స్పష్టంగానే బోధపడిందని పట్టభద్ర ఓటర్లు చర్చించుకుంటున్నారు. మరోవైపు పిడిఎఫ్ తరపున పోటీచేస్తున్న డాక్టర్ కోరెడ్ల రమాప్రభ గెలుపు దిశగా పయనిస్తున్నారని మెజార్టీ ఓటర్ల మనోగతంగా వినిపిస్తోంది. ఈనేథ్యంలోనే పాలకపార్టీల తరపున పోటీచేస్తున్న అభ్యర్థుల గెలుపుకోసం కృషిచేస్తామని అధినేతలకు హామీ ఇచ్చిన ఎమ్మెల్యేలు, ఇతర నాయకులకు ముచ్చెమటలు పడుతున్నాయి. ఈనేపథ్యంలో నైతికతను పక్కనబెట్టి డబ్బు, మద్యం, కానుకలను ఎరజూపేందుకు ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయి.

పిడిఎఫ్ ఎమ్మెల్సీలంతా... తొలి నుంచీ ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రైవేటీకరణ విధానాలను వ్యతిరేకిస్తున్నారు. ఉద్యోగులు, నిరుద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీగా ఎన్నికైన ఎంవిఎస్ శర్మ ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం ప్రజల గొంతుగా పనిచేశారు. కేవలం శాసన మండలిలోనే కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఎన్నో సమస్యలను అప్పటి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారు. ఆ తరువాత టిడిపి మద్దతుతో ఎమ్మెల్సీగా ఎన్నికైన పెద్దమనిషి గడిచిన ఆరేళ్లలో పత్తాకు కూడా కనిపించలేదు. విభజన హామీల గురించిగానీ, స్టీల్‌ప్లాంట్ విక్రయంపైగానీ ప్రశ్నించలేదు. మరోవైపు పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభ ఇప్పటి వరకు ప్రజాసేవకు అంకితమై పనిచేశారు. ఈనేపథ్యంలో పిడిఎఫ్ తరపున పోటీలో నిలిచిన డాక్టర్ కోరెడ్ల రమాప్రభకే ఓట్లేయాలన్న తలంపుతో ఉన్నామని ఉమ్మడి విజయనగరం జిల్లాలోని మెజార్టీ ఓటర్లు చెబుతున్నారు.

పర్యాటక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జెసి ఆనంద్, పిఒ నవ్య

పర్యాటక ప్రాంతాల పరిశీలన

సీతంపేట : ఐటిడిఎ పరిధిలో గల పలు టూరిజం ప్రాంతాలను పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ ఓ ఆనంద్ శనివారం పరిశీలించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సీతంపేట ఐటిడిఎను సందర్శించారు. ఈ సందర్భంగా తురాయ పువలసలో ఉన్న ఉద్యానవన శాఖకు సంబంధించిన నర్సరీని పరిశీలించారు. నర్సరీలో టూరిజం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం సెరికల్చర్ నర్సరీని పరిశీలించారు. ఐటిడిఎలోని గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో గల జిమ్‌ను పరిశీలించారు. జిమ్ అత్యాధునికంగా నిర్మించారని కొనియాడారు. జిల్లాలో ఎక్కడా ఇటువంటి జిమ్ లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో పిఒ బి.నవ్య డిపిఒ సతీష్ కుమార్, ఇంచార్జ్ జాకబ్ దయానంద్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

డిప్యూటీ సిఎంను కలిసిన అవనాపు

విక్రమ్‌ను సత్కరిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

సాలూరు : డిప్యూటీ సిఎం రాజన్నదొరని శనివారం వైసిపి యువజన విభాగం జోనల్ ఇంఛార్జి అవనాపు విక్రం కలిశారు. పార్వతీపురం మన్యం, పాడేరు జిల్లాలకు యువజన విభాగం జోనల్ ఇంఛార్జిగా వైసిపి నియమించింది. ఈ నేపథ్యంలో ఆయన డిప్యూటీ సిఎం రాజన్నదొరని కలిసి నియామకానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట డిసిఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకృష్ణ ఉన్నారు.

ర్యాలీ చేస్తున్న వ్యవసాయ సిబ్బంది, రైతులు

సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన ర్యాలీ

పార్వతీపురం రూరల్ : సేంద్రియ వ్యవసాయ పద్ధతులు అవలంభించడం ద్వారా రసాయన ఎరువుల ఖర్చు తగ్గడమే కాకుండా, పంట భూములను సారవంతంగా తయారు చేసుకోవచ్చని ప్రకృతి వ్యవసాయం కమ్యూనిటీ మేనేజ్, పార్వతీపురం విభాగం కోఆర్డినేటర్ వై శ్రీరాములు అన్నారు. ఈ మేరకు శనివారం ఎమ్మార్ నగరంలో ఉపసర్పంచి వంగపండు త్రినాధ నాయుడు ఆధ్వర్యంలో గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను కలిసి భూములను సారవంతంగా చేసుకోవడానికి 30 రకాల విత్తనాలను పొలాల్లో జల్లుకొని ఆ తర్వాత వాటిని కలియదున్నుకుంటే భూములు సారవంతంగా మారి దిగుబడి అధికంగా వస్తుందని, తద్వారా పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని వివరించారు.

ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలు

ప్రమాదకరంగా విద్యుత్తు తీగలు

కురుపాం : స్థానిక మండల కేంద్రంలో గల శోభలతా దేవి కాలనీ వద్ద కరెంటు స్తంభం నుంచి విద్యుత్ వైర్లు నేలకు దగ్గరలో వేలాడుతుండడంతో కాలనీ వాసులు భయపడుతున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ శాఖ అధికారులకు సుమారుగా రెండు నెల క్రితం తెలిపినా ఇంతవరకు పట్టించుకోలేదన్నారు. పిల్లలు వీధుల్లో ఆడుకుంటుంటారని స్తంభం వంగిపోయి వైర్లు వేళబడడంతో ఏ సమయంలో ఏం జరుగుతుందో తెలియదని, కావున విద్యుత్ అధికారులు స్పందించి స్తంభాన్ని మార్చి విద్యుత్ వైర్లు సరిచేయాలని కోరుతున్నట్లు తెలిపారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎలక్షన్ సీనియర్ సహాయకులు పద్మిని

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

కురుపాం : ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు పూర్తయినట్లు ఎలక్షన్ సీనియర్ సహాయకులు పద్మిని తెలిపారు. శనివారం ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహిస్తున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద పోలింగ్ కేంద్రాన్ని తన సిబ్బందితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బూత్ నెంబర్ 72 వద్ద 582 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని, పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని మౌలిక వసతులు ఉన్నాయని అన్నారు. ప్రతి ఒక్క ఓటర్ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎలక్షన్ కంప్యూటర్ ఆపరేటర్ కోట సుధీర్, రెవెన్యూ సిబ్బంది జి .ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి-పాలకొండ/పాలకొండ రూరల్

ఈనెల 13న జరగనున్న ఎంఎల్‌సి ఎన్నికలకు అన్ని ఏర్పాట్లను అధికార యంత్రాంగం పూర్తి చేసింది. స్థానిక సంస్థల నుంచి ఎంఎల్‌సి స్థానానికి ఎన్నిక జరగనుండగా, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎంఎల్‌సి స్థానానికి కూడా అదే రోజు ఎన్నిక జరగనుంది. పాలకొండ డివిజన్ పరిధిలో స్థానిక సంస్థలు ఎంఎల్‌సి స్థానానికి రాజాం, పాలకొండ నియోజకవర్గాల పరిధిలో గల ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిలతో పాటు పాలకొండ నగర పంచాయతీ కౌన్సిలర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. 153 మంది ఓటు హక్కును సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో వినియోగించుకోనున్నారు. ఈ స్థానానికి వైసిపి అభ్యర్థి నర్తు రామారావుతో పాటు స్వతంత్ర అభ్యర్థిగా ఆనెపు రామకృష్ణ బరిలో ఉన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎంఎల్‌సి స్థానానికి పాలకొండ రెవెన్యూ డివిజన్ పరిధిలో 5,230 మంది ఓటర్లు ఉన్నారు. వీరంతా ఆయా మండలాల పరిధిలో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. పాలకొండ మండలానికి సంబంధించి స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రధానంగా పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ, వైసిపి, టిడిపి మధ్య పోటీ కనిపిస్తుంది. అయితే పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థికే ఓటర్లు మొగ్గుచూపుతున్నారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి కృష్ణారావు

సజావుగా ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలి

ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని డిఎస్‌పి జివి కృష్ణారావు పోలీసు అధికారులను ఆదేశించారు. శనివారం డిగ్రీకళాశాల మైదానంలో పోలీసు సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈనెల 13న జరగనున్న ఎంఎల్‌సి ఎన్నికలకు గట్టిబందోబస్తు ఇవ్వాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో పాలకొండ, ఎల్విన్‌పేట సిఐలు జి.మురళీధర్, సత్యనారాయణతో పాటు సబ్‌డివిజన్ ఎస్‌ఐలు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ క్లినిక్ భవనాల నిర్మాణం వద్ద సిఎం ఫొటోతో ఉన్న ఫ్లెక్సీ

ఎన్నికల కమిషన్ ఆదేశాలు బేఖాతరు

వీరఘట్టం : పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా వివిధ రాజకీయ నాయకుల చిత్రపటాలు, ఫ్లెక్సీలు తొలగించడంతో పాటు విగ్రహాలకు ముసుగులు వేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలు స్పష్టంగా ఉన్నప్పటికీ ఇక్కడ అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఎక్కడికక్కడే ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఫోటోతో ఉన్న ఫ్లెక్సీలు, బ్యానర్లు దర్శనమిస్తున్నాయి. అంతేకాక స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి సమీపాన కొత్తగా నిర్మిస్తున్న వైయస్సార్ క్లీనిక్ భవనాలు వద్ద గల సిఎం జగన్మోహన్‌రెడ్డి ఫోటోతో బోర్డులు ఏర్పాటు చేశారు. ఇదే మార్గం గుండా మండల విద్యాశాఖ, ఐసిడిఎస్, ఉపాధిహామీ, వెలుగు, మండల పరిషత్, ట్రాన్స్కో గృహ నిర్మాణ శాఖలకు సంబంధించిన కార్యాలయాలతో పాటు విద్యాసంస్థలు కూడా ఉన్నాయి. నిత్యం మండల స్థాయి అధికారులు విధులు నిర్వహిస్తున్నప్పటికీ వీటిపై దృష్టి పెట్టినప్పటికీ అధికారంలో వైసిపి ఉన్నందున అధికారులు ఎన్నికల కమిషన్ ఆదేశాలను ఉల్లంఘిస్తున్నట్లు స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు.

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభను గెలిపించాలి

విస్తృతంగా ప్రజాసంఘాల ప్రచారం

ప్రజాశక్తి - పాచిపెంట

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, మేధావులు, పట్టభద్రులు పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.సుబ్బారావమ్మ పిలుపునిచ్చారు. మండలంలోని ఉద్యోగులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ విభజన హామీ, ప్రత్యేక హెూదా, విశాఖ ఉక్కు ప్రైవేటుకరణకు వ్యతిరేకంగా ఒక పిడిఎఫ్ మాత్రమే పోరాటం చేస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించడంలో కీలకపాత్ర వహిస్తుంది పిడిఎఫ్ అని, ఇటువంటి పరిస్థితుల్లో మొదట ప్రాధాన్యత ఓటును డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు కోరాడ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంటౌన్ : చట్ట సభల్లో గొంతు వినిపించేందుకు పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కోరెడ్ల రమాప్రభను గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజాసంఘాల నాయకులు జివి రమణ, బి.సూరిబాబు, పి.సన్యాసిరావు, ఎస్.ఉమామహేశ్వరరావు పట్టణ ప్రధాన రహదారిలో గల పట్టభద్రుల వ్యాపారస్తులను, అంగన్వాడీ కార్యకర్తలను రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ప్రచారం చేస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు.

సీతానగరం : మండలంలోని కృష్ణరాయపురం, పెద్దఅంకలాం, చెల్లంనాయుడు వలస, సూరంపేటల్లో కోరెడ్ల రమాప్రభకు మద్దతుగా ప్రజా సంఘాల నాయకులు ప్రచారం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి ఈశ్వరరావు మాట్లాడుతూ శాసనమండలిలో ప్రజాసమస్యలపై మాట్లాడే రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు జి.వెంకటరమణ, రెడ్డి రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు

పాచిపెంట : మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

వీరఘట్టం : ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధి, మెరుగైన విద్య, వైద్యం, ఉపాధి, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పింఛనుదారుల సమస్యలు పరిష్కారం కోసం పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ కోరండ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఎమ్మెల్సీగా గెలిపించాలని సిపిఐ ఎంఎల్, అఖిలభారత గ్రామీణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం వీరఘట్టంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి పి.భాస్కరరావు మాట్లాడుతూ ప్రజా ప్రయోజనాలు కోసం కచ్చితంగా పనిచేసినటువంటి రమాప్రభకు మొదటి ప్రాధాన్యం ఓటు వేసి అత్యధిక మెజార్టీతో శాసనమండలికి పంపించాలని కోరారు. కార్యక్రమంలో విజయకుమార్ గౌరి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు అన్నారు. మండలంలో పట్టభద్రుల ఓటర్ల ఇంటి వద్దకు వెళ్లి తమ అమూల్యమైన ఓటును బ్యాలెట్ నెంబర్ 11 లో కోరడ్ల రమాప్రభ పేరుకు ఎదురుగా మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలుపునకు కృషి చేయాలని కోరారు. శాసనమండలిలో ప్రశ్నించే గొంతు ఉండాలని అది కేవలం పిడిఎఫ్ అభ్యర్థులతోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్, గిరిజన సంఘం నాయకులు కూరంగి సీతారాం తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ రూరల్ : పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని పాలకొండ పట్టణంతో పాటు మండలంలో పలు గ్రామాల్లో శనివారం వివిధ ప్రజాసంఘాల నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసనమండలి స్థానానికి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ఫెన్షనర్ల, ప్రజాసంఘాల తరుపున ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ప్రంట్(పిడిఎఫ్) అభ్యర్థిగా పోటీ చేస్తున్న రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు 1 వేసి గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు ఎం.తిరుపతిరావు, దావాల రమణారావు, ఉమామహేష్, పి.ప్రభాకరరావు, కాద రాము, పట్టాభి తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : ప్రచారం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

భూ సర్వే చేస్తున్న అధికారులు

వివాదాస్పద భూమి సర్వే

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని తోణాం పంచాయతీ దిగువమెండంగి సమీపాన గల పూతికవలస మైనింగ్ వివాదం కొలిక్కి వచ్చే అవకాశం కనిపిస్తోంది. గత తొమ్మిదేళ్లుగా అటవీశాఖ అధికారుల, మైనింగ్ యజమానుల మధ్య భూవివాదం నడుస్తోంది. పూతికవలసలో ఉన్న అన్ సర్వే భూముల్లో మైనింగ్ తవ్వకాలకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. 21.77హెక్టార్లలో మాంగనీస్ మైనింగ్ తవ్వకాలకు కేంద్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. అయితే ఈ భూముల హద్దు విషయంలో అటవీశాఖ అధికారులు, మైనింగ్ యజమానుల మధ్య వివాదం 2014లో తలెత్తింది. అటవీశాఖకు చెందిన భూమిలో మైనింగ్ తవ్వకాలు జరపొద్దని అప్పటి అటవీశాఖ రేంజ్ అధికారి అడ్డగిం చారు. మైనింగ్ యజమానికి సంబంధించిన జెసిబిలను సీజ్ చేశారు. ఆ తర్వాత ఈ వివాదం కోర్టుకు వెళ్లింది. వివాదా స్పంగా ఉన్న ఐదు హెక్టార్ల భూమి తమకు అనుమతి ఇచ్చిన భూమి పరిధిలోనిదని మైనింగ్ యజమాని వాదించారు. రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉన్న భూమి అని అటవీశాఖ అధికారులు వాదించారు. వివాదాస్పద భూమి ఎవరిదో తేల్చాలని సర్వే ఆఫ్ ఇండియా అధికారులను ఇటీవల హైకోర్టు ఆదేశించింది. దీంతో గత కొద్దిరోజులుగా అటవీ అధికారులు, మైనింగ్ యజమానుల సమక్షంలో జిఎస్‌ఐ అధికారులు సర్వే చేస్తున్నారు. సర్వే చేసిన తర్వాత ఆ నివేదికను అధికారులు హైకోర్టుకు సమర్పించనున్నట్లు తెలుస్తోంది. తొమ్మిదేళ్లుగా వివాదం తలెత్తడంతో మైనింగ్ కంపెనీ నుంచి ప్రభుత్వానికి రావాల్సిన కోట్లాది రూపాయల ఆదాయం స్తంభించి పోయింది. ఈ ప్రాంతంలో మైనింగ్ తవ్వకాలు నిలిచి పోవడంతో గిరిజనులు కూడా ఉపాధి కోల్పోయిన పరిస్థితి ఏర్పడింది. తొమ్మిదేళ్లుగా నలుగుతున్న వివాదానికి త్వరలో తెరపడనుంది.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పరామర్శ

వంగర: మండల కేంద్రానికి చెందిన రౌతు సూరి నాయుడు (మేస్త్రి) ఇటీవల కాలంలో అనారోగ్యం కారణంగా మృతి చెందిన విషయాన్ని తెలుసుకుని వారి కుటుంబ సభ్యులను రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ శనివారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ పరామర్శలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలతో పాటు వంగర ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ, మండల వైసిపి కన్వీనర్ కరణం సుదర్శనరావు, పాలవలస ధవళేశ్వర రావు, స్థానిక సర్పంచ్, కనగల పారి నాయుడు, శివ్వాం సర్పంచ్ బొక్కేల వెంకటఅప్పలనాయుడు, నాయకులు బూరాడ వెంకటరావు, మండల మహిళా అధ్యక్షురాలు కాంబోతుల భగవతి, వెంకట్ నాయుడు, స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

మరో రూ.7 కోట్లు అవసరం

ప్రజాశక్తి - మక్కువ

విస్తరించనున్న రోడ్డు ఇదే

మండల కేంద్రంలో నాలుగు లైన్ల సిసి రోడ్ విస్తరణ పనులకు మరో రూ. 7 కోట్లు అవసరమని సిఎం దృష్టికి తీసు కెళ్లినట్లు జెడ్‌పిటిసి మావుడి శ్రీనివాస రావు తెలిపారు. ఇటీవల సిఎం జగన్మోహన్‌రెడ్డిని డిప్యూటీ సిఎం రాజన్నదొర, జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుతో కలిసి రోడ్డు గురించి వివరించినట్లు శనివారం ప్రజాశక్తికి తెలిపారు. మండలంలో సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్లానన్నారు. మక్కువ ప్రధాన రహదారి అధ్వానంగా తయారైన నేపథ్యంలో ప్రజలు ఎన్నో అవస్థలకు గురికావాల్సి వస్తుందని భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని నాలుగు లైన్ రహదారి నిర్మాణం ప్రతిపాదించామని అయితే వాటికి సరిపడే నిధులు మంజూరు చేయాలని సిఎంను కోరినట్లు తెలిపారు. దీనికి సిఎం సానుకూలంగా స్పందించారని ఆయన అన్నారు. రోడ్డు విస్తరణలో నష్టపోయిన కుటుంబాలను ఆదుకునేందుకు కూడా ప్రణాళిక తయారు చేయాలని ఇప్పటికి అధికారులుకు ఆదేశించారని ఆయన తెలిపారు.

బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు, పట్టభద్రులు

రమాప్రభకు మద్దతుగా బైక్‌ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 13న జరుగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ విజయనగరంలో శనివారం ప్రజాసంఘాల ఆధ్వర్యాన బైక్ ర్యాలీ నిర్వహించారు. కోట జంక్షన్ వద్ద ప్రారంభమైన ర్యాలీ మూడులాంతర్లు, ఎమ్‌జి రోడ్డు, గంటస్తంభం, కన్యకా పరమేశ్వరి ఆలయం, ఎన్‌సిఎస్, రైల్వేస్టేషన్, మయూరి జంక్షన్ మీదుగా అర్‌టిసి కాంప్లెక్స్ వరకు సాగింది. ఈ సందర్భంగా ప్రజాసంఘాల, ఉద్యోగ సంఘాల నాయకులు ఎం.శ్రీనివాస, సిఐటియు నాయకులు రెడ్డి శంకరరావు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం పోరాడుతున్న శక్తులకు అండగా నిలిచినది పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమేనని అన్నారు. స్టీల్ ప్లాంట్ రక్షణ కోసం, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం, ఉత్తరాంధ్రలో నీటివనరుల వినియోగానికి సంబంధించి ప్రాజెక్టుల కోసం, నిరుద్యోగులు, విద్యార్థులు, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న పిడిఎఫ్ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీ తో గెలిపించాలని కోరారు. కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బిజెపి, వైసిపిలు రాష్టానికి రావాల్సిన ప్రత్యేక హోదా, విభజన హామీలు కోసం మాట్లాడటం లేదని అన్నారు. మూసివేసిన పరిశ్రమలు తెరిపించాలని, సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేయాలని, కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని పిడిఎఫ్ డిమాండ్ చేస్తోందన్నారు. యాప్‌లతో ఉద్యోగ ఉపాధ్యాయులను వేధిస్తున్న వైసిపి, రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపిలను ఓడించాలని కోరారు. ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద రెడ్డిశంకర్రావు అధ్యక్షతన జరిగిన సభలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ఎపి మెడికల్ రిప్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి యు ఎస్ రవికుమార్, ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.రమేష్‌నాయుడు, ఎస్ ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి పి.రామ్మోహన్, సిఐటియు నగర కార్యదర్శి బి.రమణ, పట్టణ పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామచంద్ర రావు తదితరులు మాట్లాడారు. ఉద్యోగులు, ప్రజాసంఘాల నాయకులు, పట్టభద్రులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. శనివారం పట్టణంలో కోరెడ్ల రమాప్రభకు మద్దతుగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ 250 ప్రజా సంఘాలు బలపరిచిన, సామాజిక కార్యకర్త, విద్యావేత్త డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మద్దతివ్వాలని కోరారు.

వడదెబ్బ తగలకుండా ముందస్తు చర్యలు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

వేసవికాలం దృష్ట్యా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. ఈ మేరకు ఆయన బాలగుడబలోని ఎర్ర చెరువు వద్ద ఉపాధిహామీ వేతనదారులు తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పనుల నిమిత్తం బయటకు వెళ్లేటప్పుడు తప్పని సరిగా తాగు నీరు అందుబాటులో ఉంచుకోవాలని, మజ్జిగ, నిమ్మరసం, బార్లీ మొదలగు ద్రావణాలను ఎప్పటికప్పుడు తీసుకోవాలని తెలిపారు. నూనె, కొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉండే ఆహారానికి దూరంగా ఉండాలని, ఇవి శరీరంలో నీటి శాతం తగ్గిస్తాయని, తద్వారా డీహైడ్రేషన్‌కు గురవుతామని అన్నారు. వృద్ధులు, నవజాత శిశువులు, గర్భిణీల విషయంలో మరింత జాగ్రతలు అవసరమని, వీలైంత వరకు నీడగా, చల్లగా ఉండే ప్రదేశాల్లో ఉండాలని సూచించారు. ఓఆర్‌ఎస్, జింక్, పారాసెటమాల్ మందులు గ్రామాల్లో, ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని వైద్య సిబ్బందికి సూచించారు.

కూలీలతో మాట్లాడుతున్న డిఐఒ జగన్మోహన్‌రావు

ఎప్పటికప్పుడు వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అనంతరం ఒఆర్‌ఎస్ ద్రావణం తయారు చేసుకునే విధానాన్ని డిఐఒ దగ్గరుండి చేసి చూపించి, అక్కడ పని చేస్తున్న పలువురికి తాగించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయగౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్ కె.తాతబాబు, ఎఎన్‌ఎం రామలక్ష్మి, పాల్గొన్నారు.

ప్రణాళికా బద్ధంగా చదవాలి

సీతంపేట: పదో తరగతి విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదివితే ఉత్తీర్ణత తప్పనిసరిగా సాధించవచ్చని మండలంలోని దోనుబాయి గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొండ గొర్రె సుబ్బారావు అన్నారు. ఆ పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సుబ్బారావు మాట్లాడుతూ పరీక్షలు సమీపిస్తున్నాయని, తక్కువ సమయం ఉన్నందున అలక్ష్యం చేయకుండా చదువుకోవాలని కోరారు. ముఖ్యంగా ఇంట్లో టీవీ కి పిల్లలను దూరంగా ఉంచి చదివించాలన్నారు. ప్రతి ఒక్కరూ వంద శాతం మార్కులు సాధించాలన్నారు. పరీక్షలు జరిగిన తర్వాత విద్యార్థులు సెలవుల్లో సమయం వృథా చేయకుండా పోటీ పరీక్షలకు చదువుకోవాలని, కంప్యూటర్ నేర్చుకోవాలని సూచించారు. ఇందుకు విద్యార్థుల తల్లిదండ్రులు కూడా సహకరించాలని కోరారు. సమావేశంలో డిప్యూటీ వార్డెన్ గణపతి రావు ఉత్తర రావ్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

చెట్టు పైనుండి జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి- సీతంపేట

మండలంలో మర్రి మాను గూడా గ్రామానికి చెందిన ఊయిక అప్పారావు (27) చెట్టు మీద నుంచి జారిపడి మృతి చెందారు. వెలగాపురం గ్రామ సమీపంలో చింతపండు సేకరించడానికి గ్రామస్తులతో వెళ్లగా చెట్టు మీద నుంచి జారిపడిపోయాడు. కొన ఊపిరితో ఉన్న అప్పారావును సీతంపేట ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య జ్యోతి, నలుగురు పిల్లలు ఉన్నారు. దీనిపై దోనుబాయి ఎస్‌ఐ పి. కిషోర్ వర్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు..